# అక్కడే వచ్చింది చిక్కు

* పుట్టా వెంకట్రాయుడు *

"ఏమిరా! పెళ్ళికూతుర్ని చూడటానికి వెళ్ళావుగదా! పిల్ల కాస్త బాగున్నట్టేనా!" అని అడిగాను.

"ఏమని చెప్పేదిరా! వెళ్ళిన వేళావిశేషాలు బాగులేనప్పుడు."

"ఏమయిందిరా."

"కావలసింది కాకుండా పోయింది."

"అంటే" అన్నమాట నా నోటినుంచి అప్రయత్నంగా పడింది.

"చెప్పేగా! కావలసిందికాకుండాపోయిందని."

"నీకు పిల్ల నచ్చలేదా!" అని అమాయకంగా అడిగాను.

"పిల్లనచ్చకేమిరా! పసినిమ్మపండులా ఉంది. చూసీ చూడగానే "ఐసు" అయిపోయానంటే నమ్ము. మన కాలేజీలో ఉన్న లేడీ స్టూడెంట్సంతా, ఆ పిల్లముందు "మంకీస్"లా కనుపించేరు నా కంటికి."

"మరయితే ఇకనేం! ఈడూ జోడూ బాగుంటుందికదా! సెటిల్ చేసుకోలేకపోయినావా?"

"అక్కడే వచ్చింది చిక్కు."

"ఏం! మీ ఫాదరు కట్నంగురించి పేచీ పెట్టారా?"

"అది కాదురా! మళ్లీ ఆ గొడవ తలచుకుంటే ఏడుపు వస్తుందిరా!"

"చెప్పరా! ఫరవాలేదు."

"అసలు, నేను పిల్లను చూడకుండానే మా ఫాదరు సెటిల్‌చేసి నాకు ఉత్తరం వ్రాశారు. నేను ఇంటికివెళ్ళి పిల్లనుచూస్తేకాని పెళ్ళిచేసుకోనని పట్టుపట్టాను. అప్పుడు మా ఫాదరు పిల్లను చూడనవసరంలేదు. బాగుంటుంది. ఈ సంవత్సరమే స్కూలుఫైనలు పేసయిందట' అని అన్నారు. అది నాకంత ఇష్టంలేకపోవటంచేత పిల్లను చూచుకొందుకు బయలుదేరాను. ఆ పిల్లది ఒక పల్లెటూరు. నేను వెళ్ళిన మరునాడు పిల్లను నాకు చూపించేరు. ఆ పిల్ల ఈజీచైరులో కూర్చుంది. నేను ఇంటర్‌వ్యూకి వెళ్ళేను. నన్ను చూసీకూడా కుర్చీలోనుంచి లేవలేదు. 'చదువుకొన్న విద్యావతి' అని చెప్పేటందుకు నిదర్శనంగా చేతిలోనున్న 'ఆనందవాణి' వారపత్రికను చూస్తూఉంది. 'పిల్లనాకు నచ్చింది' అనే సంతోషంతో, నన్నుచూచి లేవలేదన్న ఈర్ష్యపోయింది. చూపులు అయిపోయాయి వచ్చేస్తున్నాను. ఇంతలో ఆ పిల్ల 'నన్ను చూడటం అయిపోయిందా' అని అడిగింది.

'ఆ' అని జబాబు చెప్పేను.

'నచ్చేనా' అని అడిగింది

'ఆ' అన్నాను.

'అయితే పెళ్ళిచేసుకుంటారా' అని అంది.

'నిరభ్యంతరంగా' అని అన్నాను.

"అయితే! మీరు" ఇక్కడకు వచ్చింది నన్ను చూడటానికన్నమాట. పిల్ల నచ్చితే పెళ్ళిచేసుకుంటారన్నమాట. నచ్చకపోతే ఆ పిల్లగతి అంతేనా, పెళ్ళిచేసుకోనువాలంటే ఒక్క పురుషుని ఇష్టమయితే చాలునన్నమాట. స్త్రీ, పురుషుని చూడనవసరంలేకుండానే పెళ్ళి చేసుకోవాలా,? ఒక్క పురుషుని ఇష్టంతో ఉందన్నమాట! స్త్రీకి ఇష్టంలేకపోయినా సరేనన్నమాట, అంతేనండి! మీరు నన్ను చూచేరుగనుక, ఈసారి మీరు వెళ్ళవచ్చు. నేనుకూడా మిమ్మల్ని చూడటం అయింది. నాకు మీరు బాగులేరు. అందుచేత దయవుంచి ఈ ప్రయత్నంనుండి విరమించుకోండి" అని లెక్చరు ఇచ్చేసేటప్పటికి, నా శరీరమంతా చెమటతో నిండిపోయింది. బ్రతుకు జీవుడా అని బయటపడ్డాను."

"బాగుందిరా! శాస్త్రి, అయితే మంచి గ్రేడు ఇచ్చిందన్నమాట."